బాబోయ్ కుక్కలు!

గుడ్లవల్లేరు మండలంలో పిచ్చి కుక్కల స్వైర విహారం

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు మండలంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తుండడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. కొన్నిచోట్ల పిచ్చికుక్కలు తిరుగుతూ పలువురిని గాయాలు పాలు చేస్తున్నాయి. ప్రస్తుతం వాతావరణంలో నెలకొన్న ఉష్ణోగ్రతల ప్రభావంతో తాగేందుకు నీళ్లు, తినడానికి ఆహారం లభించక పోవడంతో కుక్కల ప్రవర్తన సహజత్వానికి భిన్నంగా ఉంటుంది. చిరాకు వల్ల పిచ్చి పట్టినట్లుగా ఉండి కనిపించిన వారిపై దాడులకు పాల్పడుతున్నాయి. గుడ్లవల్లేరు నెహ్రూనగర్‌లో శుక్రవారం ఒక పిచ్చికుక్క స్వైర విహారం చేసి బి.రత్నసుధ, కె.రోశమ్మను కరిచి తీవ్రంగా గాయపరిచింది. రెండు గేదలు, ఒక దూడ, ఒక ఆవు కూడా ఈ పిచ్చికుక్క కాటుకు గురైన విషయం తెలిసిందే. అలాగే కౌతవరంలో మరొకరు కుక్కకాటుకు గురై చికిత్స పొందుతున్నారు. వీధి కుక్కల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



గుడ్లవల్లేరులో కుక్కల స్వైర విహారం

ఇవి చేయరాదు..

- పెంపుడు కుక్కలను యజమానులు వీధుల్లోకి వదలరాదు.
- పెంపుడు కుక్కలను ఎల్లపుడూ కట్టి ఉంచరాదు. దీనివల్ల వాటిల్లో ఆగ్రహం పెరుగుతుంది.
- వీధి కుక్కలు వెంబడించినప్పుడు బైకులు, సైకిళ్ల వేగం పెంచరాదు.
- ఇంట్లో మిగిలిపోయిన ఆహారం, ఎముకలు ఎక్కడ బడితే అక్కడ వేయరాదు.
- ఎందుకంటే తిండి దొరికినంతకాలం వీధుల్లో కుక్కల సంతానం వృద్ధి చెందుతూనే ఉంటుంది.

కుక్క కాటుకు ఇలా చేయాలి

- కుక్క కరిచిన చోట కుళాయి లేదా మగ్గుతో నీటిని ధారగా పోస్తూ సబ్బుతో 10 నిముషాలు కడగాలి.
- డెటాల్, లేదా గడ్డం గీసుకున్న తర్వాత వాడే లోషన్ పూయాలి. వీలైనంత త్వరగా వైద్యుడిని సంప్రదించాలి.
- పిచ్చి కుక్క అయితే మాత్రం వెంటనే రేబిస్ టీకాలు వేయించాలి. అయితే గాయాన్ని రుద్ది కడగరాదు.
- గాయంపై టింక్చర్, అయోడిన్ వేయకూడదు. గాయానికి కుట్లు వేయడం గట్టిగా నొక్కడం చేయరాదు.

జాగ్రత్తలు ఇవి..

- కుక్క దగ్గరికి వస్తే ఏ మాత్రం కదలకుండా నిలబడి ఉండటం ఉత్తమం.
- అవి దగ్గర ఉన్నపుడు ఎట్టి పరిస్థితుల్లోనూ పరిగెత్తరాదు. వాటి కళ్లలోకి నేరుగా చూడరాదు. కుక్క పిల్లల దగ్గరకు వెళ్లరాదు. తల్లి కుక్క దాడి చేసే ప్రమాదం ఉంది.
- కుక్కలు నిద్రిస్తున్నపుడు, తింటున్నప్పుడు, పిల్లలకు పాలిస్తున్నపుడు వాటిని కర్రలు, రాళ్లతో బెదిరించడం గాని, ఏ రకంగానైనా ఇబ్బంది పెట్టడం చేయరాదు.

చిన్నారులకు ఇబ్బందులు



కుక్కలతో కంటి మీద కునుకు లేకుండా ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. మందలు మందలుగా వచ్చేసి.. జనంపై పడిపోతున్నా ఏం చేయలేని పరిస్థితి. ఆ గుంపుల మందను తోలుదామంటే కరిచేందుకు మీదకు వచ్చి పడిపోతున్నాయి. వృద్ధులు, చిన్నారులు, మహిళలు చాలా ఇబ్బందులు పడుతున్నారు.

– గుదే రవి, వైఎస్సార్ సీపీ మండల యువజన సంఘ అధ్యక్షుడు

దూరంగా వదిలేందుకు ప్రయత్నిస్తున్నాం



కుక్కలతో గ్రామంలో ఇబ్బందులు ఉన్న మాట వాస్తవమే. వాటిని అదుపు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కుక్కలను చంపితే నేరమని వాటిని కూడా పట్టించి దూరంగా వదిలేందుకు ప్రయత్నిస్తున్నాం. అవి మళ్లీ తిరిగి వచ్చేస్తున్నాయి. చర్యలు తీసుకున్నా ఫలితం దక్కటం లేదు.

– ఏజేఎల్ నరసింహారావు, గ్రామ కార్యదర్శి, గుడ్లవల్లేరు

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

గుడ్లవల్లేరు: ప్రతి గ్రామంలోని ప్రజలు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని ఎంపీడీఓ ఎండీ ఇమ్రాన్ అన్నారు. గుడ్లవల్లేరులో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర ర్యాలీని శనివారం చేపట్టారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. గ్రామ కార్యదర్శి ఏజేఎల్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ కార్యాలయంలో 'స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర'

పెదపూడి(మొవ్వ): స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ పెదపూడి కార్యాలయంలో శనివారం స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ దోనేపూడి శివరామయ్య తోపాటు ప్రత్యేక శ్రేణి కార్యదర్శి ఎస్.అక్బర్ బాషా, సిబ్బంది చీపురులు పట్టుకుని కార్యాలయంలో బూజు దులిపి శుభ్రం చేశారు. అనంతరం స్వీపర్ బాలమ్మను సత్కరించారు.

అన్నసమారాధన

గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు భారీ అన్న సమారాధనను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతులు ప్రారంభించారు. మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆర్థిక సాయంతో జరిగిందని నిర్వాహకులు తెలిపారు.

క్లుప్తంగా

అమ్మవారికి గాజుల అలంకారం



గుడివాడరూరల్: స్థానిక జగన్నాధపురంలోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం శ్రావణమాసం చివరి రోజు సందర్భంగా శ్రీరాజ్యలక్ష్మి అమ్మవారికి భక్తుల సహకారంతో గాజుల అలంకరణ చేశారు. సామూహిక కుంకుమార్చనలను ఆలయ అర్చకస్వామి వేదాంతం అప్పలాచార్యుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు తెల్లవారు జాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలేత్తకుండా ఆలయ ఈఓ కందుల వేణుగోపాలరావు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

ఉచిత వైద్యశిబిరం



పమిడిముక్కల: మండలంలోని హనుమంతపురంలో శనివారం రోటరీ క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో కంటి, దంత, జలుబు, దగ్గు, జ్వరం, బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. 129 మంది పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. శిబిరంలో ఆరుగురికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారని, వారికి రోటరీ కంటి ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ చొప్పరపు నాగ సుబ్రమణ్యం తెలిపారు.

ఆధ్యాత్మిక వైభవాన్ని పెంపొందించేలా ఉత్సవాలు



గుడివాడరూరల్: గుడివాడలో ఆధ్యాత్మిక వైభవాన్ని మరింత పెంపొందించేలా గణపతి నవరాత్రి మహోత్సవాలను నిర్వహించాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. స్థానిక రాజేంద్రనగర్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో స్థానిక మెయిన్‌రోడ్డులోని శ్రీవిఘ్నేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 27వ తేదీ నుంచి జరగనున్న గణపతి నవరాత్రి మహోత్సవాల ఆహ్వాన పత్రికలను ఎమ్మెల్యే శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ సాయన రాజేష్, ఈఓ యార్లగడ్డ వాసు, సభ్యులు పాల్గొన్నారు.

సీపీఐ నేత సుధాకర్‌రెడ్డి మృతి తీరని లోటు



పెదపూడి(మొవ్వ): సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ పార్లమెంటు సభ్యులు, కమ్యూనిస్టు దిగ్గజం సురవరం సుధాకర్ రెడ్డి (83) మృతితో తమ పార్టీ ఉద్యమ యోధుడిని కోల్పోయిందని నాయకులు పేర్కొన్నారు. మొవ్వ మండలం కూచిపూడి–పెదపూడి సెంటర్లోని కాంచన రావు సీపీఐ భవనంలో శనివారం ఆ పార్టీ నేతలు సురవరం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పామర్రు నియోజకవర్గ సీపీఐ సమితి కార్యదర్శి చెరుకు శ్రీనివాసరావు, నియోజకవర్గ సహాయ కార్యదర్శి కోసూరు వెంకటఅప్పారావు, శాఖా కార్యదర్శులు బోరుకాటి నరసింహారాజు, కొండా నాగేశ్వరరావు, సభ్యులు ప్రాజ్వల మెహర్ ఆలీ, బల్ల సుబ్బారావు, చిందా రమేష్ రాజు పాల్గొన్నారు.

వ్యాపారులందరూ ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలి



కమిషనర్ మనోహర్

గుడివాడరూరల్: పట్టణ పరిధిలో వ్యాపారం చేసే వ్యాపారులందరూ ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండాలని, లేని వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ మనోహర్ పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ట్రేడ్స్ గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం అప్లికేషన్ పూర్తి చేసి, నిర్ణీత ఫీజు చెల్లించి ప్రతి వ్యాపారస్తుడు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ పొందాలన్నారు. అవగాహన లేమితో కొందరు వ్యాపారులు ట్రేడ్ లైసెన్స్ తీసుకోవడంలో నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. ఇప్పటికే స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామన్నారు. 15రోజుల వ్యవధిలో సుమారు 300మంది వ్యాపారులు కొత్తగా లైసెన్స్‌లు పొందారన్నారు. లైసెన్స్‌లు లేని వ్యాపారులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.

తల్లిదండ్రులపై నిర్లక్ష్యం వహించొద్దు

గుడివాడరూరల్: నవ మాసాలు కని పెంచి పోషించిన తల్లిదండ్రులపై నిర్లక్ష్యం వహించవద్దని బీజేపీ పట్టణ అధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ(ఆర్కే) అన్నారు. స్థానిక పెదకాల్వ సెంటర్‌లో రెండు రోజుల నుంచి ఓ వృద్ధురాలు అక్కడే ఉండటంతో స్థానికులు ఆర్‌కేకే సమాచారం అందించారు. ఈక్రమంలో ఆయన శనివారం అక్కడకు చేరుకుని ఆ వృద్ధురాలిని బేతవోలు శాంతి వృద్ధాశ్రమంలో చేర్పించారు. ఈ సందర్భంగా ఆర్‌కే మాట్లాడుతూ ఆశ్రమంలో వృద్ధురాలిని చేర్పించుకునేందుకు అడిగిన వెంటనే స్పందించిన వృద్ధాశ్రమ అధినేత డాక్టర్ అప్పికట్ల జాషువాకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లంకా రాంబాబు, గాదే చరణ్ పాల్గొన్నారు.



వృద్ధురాలిని ఆశ్రమంలో చేర్పించిన ఆర్‌కే

టంగుటూరి ఆశయ సాధనకు కృషి



టంగుటూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కమిషనర్ మనోహర్



గుడ్లవల్లేరులో ఆంధ్రకేసరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ ఇమ్రాన్

గుడివాడరూరల్: స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు ఆశయ సాధనకు కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ మనోహర్ కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతుల జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత అధికారులతో కలసి కమిషనర్ టంగుటూరి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ నిర్మలకుమారి, అకౌంట్ ఆఫీసర్ జీటీ నాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: నేటి బాలబాలికలు భావి భారత పౌరులుగా ఎదిగేందుకు ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులును ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీడీఓ ఎండీ ఇమ్రాన్ అన్నారు. గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయంలో ఆంధ్రకేసరి జయంతిని పురస్కరించుకుని శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలను వేసి నివాళులర్పించారు.

క్షయపై అప్రమత్తంగా ఉండాలి

ముదినేపల్లి రూరల్: క్షయ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన ఆవశ్యకత ఉందని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి వి.శాంతిశ్రీ అన్నారు. స్థానిక స్వామ్ ఐటీఐ కళాశాల్లో ప్రిన్సిపాల్ కూనపురెడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో క్షయ నివారణపై అవగాహన సదస్సు శనివారం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ శాంతిశ్రీ మాట్లాడుతూ క్షయ గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వ్యాధి లక్షణాలు ఉన్నవారు వైద్య సిబ్బందిని సంప్రదిస్తే ప్రభుత్వం ద్వారా క్రమం తప్పకుండా ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. ప్రిన్సిపాల్ కూనపురెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ క్షయకు గురైన వారిని గుర్తించి, నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె.హరిత, వైద్య సిబ్బంది వినయ్‌కుమార్, ఎలినారాణి, కళాశాల సిబ్బంది ఓ.మణిభీమరాజు, వి.కృష్ణమోహన్ పాల్గొన్నారు.



ఐటీఐ కళాశాల్లో క్షయపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పరిశుభ్రతలో ఏలూరు జిల్లా ఆదర్శంగా నిలవాలి

కలిదిండి(కైకలూరు): పరిశుభ్రతలో ఏలూరు జిల్లాను రాష్ట్ర స్థాయిలో ఆదర్శంగా నిలపడానికి అందరూ కృషి చేయాలని కలెక్టర్ వెట్రి సెల్వి పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌తో కలసి కలిదిండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో స్వర్ణాంధ్ర –స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో శనివారం పాల్గొన్నారు. పదో తరగతి విద్యార్థులకు స్వర్ణాంధ్ర –స్వచ్ఛ ఆంధ్ర, మంచి నీటి పరీక్షలపై పాఠాలు చెప్పి, సమాధానాలను రాబట్టారు. అనంతరం మొక్కలు నాటారు. విద్యార్థులతో కలసి ర్యాలీలో పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా చేపట్టాలని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఎం.అచ్యుత అంబరీష్, జెడ్పీ సీఈఓ ఎం.శ్రీహరి, వ్యవసాయ శాఖ జేడీ షేక్ హబీబ్ బాషా పాల్గొన్నారు.



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యే కామినేని

కనకదుర్గ అమ్మవారి ఆలయ కమిటీ నియామకం

పెనమలూరు: యనమలకుదురు గ్రామం లాకు సెంటర్‌లో ఉన్న శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయ కమిటీని ప్రభుత్వం ప్రకటించిందని ఈవో ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. ఆయన శనివారం వివరాలు తెలుపుతూ కమిటీలో 9 మంది సభ్యులు ఉన్నారన్నారు. కమిటీ చైర్మన్‌గా కమ్మిలి నాగేశ్వరరావు, సభ్యులు సీహెచ్ రాంబాబు, ఎస్ విష్ణుభూపతి, బాణావత్‌నాగమ్మ, ఎం శివపార్వతి, వక్కలగడ్డ సామ్రాజ్యం, ఆర్ యువరాజు, ఏ రమేష్‌మారుతీకుమార్, కొడాలి కనకదుర్గ ఉన్నారు. ఆలయ అర్చకుడు ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఉంటారు. నూతన కమిటీ సోమవారం ప్రమాణ స్వీకారం చేస్తుందని ఈఓ తెలిపారు.

వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన

గుడివాడరూరల్: ఆధునిక కాలంలో స్వీయ–అనుకూలత, వ్యక్తిగత అభివృద్ధి, సంరక్షణ, మానసిక ఆరోగ్యంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ సైకాలజిస్ట్, మోటివేషనల్ స్పీకర్ పీబీ జయలక్ష్మి అన్నారు. అక్కినేని నాగేశ్వరరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల్లో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించేందుకు శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆధునిక విద్య కేవలం పుస్తక పరిజ్ఞానానికే పరిమితం కాకుండా విద్యార్థులు వేగంగా మారుతున్న ప్రపంచానికి సిద్ధం చేయడానికి అవసరమైన జ్ఞాన నైపుణ్యాలతో సన్నద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, ప్రిన్సిపాల్ ఎల్ఆర్‌కే ప్రసాద్, ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆరిగ రామారావు పాల్గొన్నారు.

ఎరువులు కొరత లేకుండా చూడాలి

ముదినేపల్లి రూరల్: మండలంలోని రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడాలని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ వ్యవసాయాధికారులను కోరారు. ముదినేపల్లిలో శనివారం మాట్లాడుతూ గత ఐదేళ్లగా ఎలాంటి ఎరువుల కొరత లేకుండా సాగు సాఫీగా జరిగి రైతులు అధిక ఉత్పత్తులు సాధించారన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వ హయాంలో కనీసం యూరియా సైతం రైతుల అవసరాలకు సరిపడా అందించలేని దుస్థితిలో ఉందన్నారు. సకాలంలో వరిపంటకు ఎరువులు వేయకపోతే దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. డీఏపీ, ఇతర కాంప్లెక్స్ ఎరువులు సక్రమంగా దొరకడం లేదన్నారు. వ్యవసాయాధికారులు వెంటనే జోక్యం చేసుకుని రైతులకు సరిపడా ఎరువులు సహకార సంఘాల ద్వారా అందించాలని కోరారు.

ప్లాస్టిక్ వాడకం హానికరం



కైకలూరు: పర్యావరణానికి హాని చేసే ప్లాస్టిక్ వాడకం వద్దంటూ కైకలూరు సేవ్ వాటర్, ఎర్త్, ఎన్విరాన్‌మెంట్ ఫ్రం ప్లాస్టిక్(స్వీప్) వ్యవస్థాపకుడు, న్యాయవాది పిచ్చికల పవన్‌కాంత్ పేర్కొన్నారు. గోనెపాడు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిల్స్ శనివారం అందించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల వచ్చే అనర్థాలు విద్యార్థులు, తల్లిదండ్రులకు వివరించారు.

డీజే బాక్సులకు అనుమతి లేదు

గుడివాడరూరల్: ఈనెల 27వ తేదీ నుంచి ప్రారంభం కానున్న గణపతి నవరాత్రి మహోత్సవాలకు డీజే బాక్సులకు అనుమతి లేదని వన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉత్సవాలు నిర్వహించే కమిటీ సభ్యులు ముందుగానే పోలీసుల అనుమతులు తీసుకోవాలన్నారు. ఉత్సవాల్లో డీజే బాక్సులకు, సౌండ్ స్పీకర్స్ పెట్టి ఎదుటివారిని రెచ్చగొట్టేలా, మరొకరిని కించపరిచేలా పాటలు కానీ, స్పీచ్‌లు గాని లేకుండా కమిటీ సభ్యులు చూసుకోవాలన్నారు.

నిబంధనలు పాటించాలి

పామర్రు(మొవ్వ): వినాయక విగ్రహం ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహించేవారు సంబంధిత అధికారుల నుంచి నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పామర్రు సీఐ సుభాకర్ పేర్కొన్నారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో పందిళ్ల నిర్వాహకులకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన వెబ్‌సైట్లో అన్ని వివరాలు నమోదు చేసుకుని పర్మిషన్ తీసుకోవాలన్నారు. ఎస్ఐ రాజేంద్ర ప్రసాద్, ట్రెయినీ ఎస్ఐ సత్యకళ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో పురుగులు?

నందివాడ: స్థానిక జెడ్పీ హైస్కూల్లో శనివారం మధ్యాహ్నం పెట్టిన భోజనంలో పురుగులు, తల వెంట్రుకలు, రాళ్లు కనిపించడంతో విద్యార్థులు ఆందోళన చెందారు. కాగా మండలంలో పలు పాఠశాలల్లో ఇదే పరిస్థితి ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజనంలో భాగంగా పాఠశాలలకు పంపిణీ చేసే బియ్యంలో నాణ్యత లోపించడంతో పురుగులు వస్తున్నాయని పేర్కొంటున్నారు. దీంతో మధ్యాహ్న భోజనం పాఠశాలల్లో చేయాలంటే విద్యార్థులు భయపడుతున్నారు. కొంతమంది విద్యార్థులు ఇళ్ల నుంచి క్యారేజీలు తెచ్చుకుంటున్నారు. పాఠశాలలకు అధికారులు ఎవరైనా వస్తున్నారని తెలిసినప్పుడు మాత్రమే భోజనం శుభ్రంగా ఉంటుందని విద్యార్థులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నాణ్యమైన భోజనం అందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



మధ్యాహ్న భోజనాన్ని చూపుతున్న విద్యార్థులు

ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు శ్రీ సాయి విద్యానికేతన్ అధినేత శింగంశెట్టి ఆదినారాయణ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. క్లీన్ అండ్ గ్రీన్ సందర్భంగా విద్యార్థులు పాఠశాల ఆవరణలో మొక్కలకు నీళ్లు పోయుట, పరిసరాలను పరిశుభ్రతగా ఉంచుట మొదలగు కార్యక్రమాలు చేసారు.

డ్వాక్రా మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

పామర్రు(మొవ్వ): డ్వాక్రా మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఎంపీడీఓ జ్యోతి అన్నారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహించిన బిజినెస్ డెవలప్‌మెంట్ సర్వీసెస్(డీబీఎస్) కార్యక్రమంపై డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా అధికారి వెంకట్రావు, ఎలీప్ సంస్థ చైర్‌పర్సన్ కనకదుర్గ, పామర్రు ఏపీఎం తిరుపతయ్య, టి శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు విగ్రహాల ఆవిష్కరణ

ముదినేపల్లి రూరల్: దివంగత వంగవీటి మోహనరంగా, ఈడేపల్లి మాజీ సర్పంచ్ బండి వెంకన్నబాబు విగ్రహాల ఆవిష్కరణ ఆదివారం ఉదయం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. వెంకన్నబాబు ఈడేపల్లి సర్పంచ్‌గా సుదీర్ఘకాలం పనిచేసి అనారోగ్యంతో మూడేళ్ల కిందట మృతి చెందారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన వెంకన్నబాబు రంగాకు అభిమాని కావడంతో రంగా, వెంకన్నబాబు విగ్రహాలను ఏర్పాటు చేసి ఆవిష్కరించనున్నారు. ఈ సందర్భంగా ముదినేపల్లి సెంటర్ నుంచి ఈడేపల్లి వరకు ఉదయం ఎనిమిది గంటలకు ర్యాలీ ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



ముదినేపల్లి రూరల్: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ సమాజాభివృద్ధికి దోహదపడాలని నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లముడి శేఖర్ బాబు అన్నారు. మండలంలోని వడాలి జెడ్పీ హైస్కూల్లో నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వినియోగం వలన కలిగే అనర్థాలపై అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగంతో వ్యక్తులు నియంత్రణ కోల్పోతూ మత్తుకు బానిసలవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ సీహెచ్ సుధారాణి, నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కో ఆర్డినేటర్ ఎం.లీలావతి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభుదాసు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ బ్రాంచి కైకలూరు వారు ఇచ్చిన భోగట్టా ప్రకారం యావన్మందికీ తెలుపునది ఏమనగా.. ఈ క్రింది షెడ్యూలులో చూపిన దాశిష్ట అనిల్ బాబు గారి భార్య దాశిష్ట ప్రేమకుమారి గారి స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేసుకుని ఋణము ఇచ్చుటకు నిర్ణయించు కున్నాము. కావున సదరు వ్యవహారానికి సంబంధించి ఎవరికైననూ ఎటువంటి అభ్యంతరాలు గానీ, ఋణాలు, ... కోర్టు వివాదాలు ఉన్న యెడల నేటి నుండి 7 రోజులలోపు ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకంగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరాలకు నా క్లయింట్ బాధ్యులు కారు.

షెడ్యూల్: ఏలూరు జిల్లా, మండవల్లి సబ్‌రిజిస్ట్రారు వారి ఖిలాకా, మండవల్లి మండలం, మండవల్లి గ్రామపంచాయితీ ఏరియాలో రేటిన దస్తావేజు నెం. 1445/2023, గ్రామ రీసర్వే నెం. 388/5ఏ, అసెస్మెంట్ నెం. 992, పాత డోర్ నెం. 8-63, కొత్త డోర్ నెం. 8-47లో గల 108.9 చదరపు గజాల స్థలం. అందుగల గ్రౌండ్ మరియు ఫస్ట్‌ఫ్లోర్ గల ఆర్‌సిసి బిల్డింగ్ సెకండ్ ఫ్లోర్ లో ఎ.సి.సి. రేకుల షెడ్డుకు గల హద్దులు. తూర్పు: ... దక్షిణం: ఎమ్. తిమ్మక్క, సమూయేలు వగైరాల స్థలం, పడమర: బజారు, ఉత్తరం: ఆర్. ప్రేమకుమారి స్థలం.

యు.వి. సుబ్రహ్మణ్యేశ్వరరావు, న్యాయవాది, మచిలీపట్నం

ప్రకటన

నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ భీమవరం బ్రాంచి వారు నాకిచ్చిన సంజాయిషీ ప్రకారం శ్రీ వాసిరి వెంకటరత్నం తండ్రి ఆదియ్య మార్టుగేజ్ చేయడానికి అంగీకరించారు. సదరు ఆస్తిపై ఏ విధమైన అభ్యంతరాలు ఉన్నా ఈ ప్రకటన వెలువడిన వారం రోజులలో తెలియజేయవలెను. తరువాత వచ్చిన అభ్యంతరములు స్వీకరించబడవు. కైకలూరు సబ్ రిజిస్ట్రార్ డాక్యుమెంట్ నం.1081/2008 కలిదిండి మండలం, కోరుకొల్లు గ్రామంకు చెందిన ఆర్.యస్.నం.184/4 లో 193.6 చ.గ. స్థలానికి హద్దులు: తూర్పు: సీతాల శ్రీనివాస చక్రవర్తి బజారు, పడమర: చెర్వు, ఉత్తరం: గ్రంథాలయ స్థలం, దక్షిణం: కలిదిండి మహాలక్ష్మి ఖనిసం స్థలం

పి.డి.యస్.వి.బాలాజీ, బి.కాం,బి.ఎల్. అడ్వకేటు,పాలకొల్లు,సెల్ : 9490438732

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

గుడివాడ డివిజన్

99516 02865 (గుడివాడ)
99516 02985 (కైకలూరు)
90105 77706 (పామర్రు)

Office mail : sakshiads@gmail.com